బాలికా విద్యకు భరోసా కస్తూర్బా

- కేజీబీవీలో చక్కటి విద్యాబోధన
- 6వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకూ అవకాశం
- ఈనెల 11వరకూ దరఖాస్తు చేసేందుకు గడువు



వంతరాంలోని కేజీబీవీ

బలిజిపేట: పేద, అనాథ బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) వారి విద్యకు భరోసాగా నిలుస్తోంది. మంచి విద్యాబోధన, ఉచిత విద్య, మౌలిక వసతుల కల్పన, ఉచిత భోజనం, ఉచిత వసతి తదితర సౌకర్యాలు అందిస్తుండడంతో కేజీబీవీల్లో ప్రవేశాలకు ప్రతి సంవత్సరం డిమాండ్ పెరుగుతోంది. ఇంటర్‌మీడియట్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన వంతరాం వద్ద ఉన్న కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్‌మీడియట్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) విద్యను అందుబాటులో ఉంచారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేజీబీవీల్లో ప్రవేశానికి విద్యార్థినులకు అవకాశం ఉంది. వాటిలో 6వ తరగతిలో ప్రవేశానికి మార్చి 27నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ గడువు ఏప్రిల్ 11తో ముగియనుంది. 6వ తరగతిలో 40సీట్లు, ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశించేందుకు 40సీట్లు ఉన్నాయి.

ఏటా 40మందికి అవకాశం

కేజీబీవీలో ఏడాదికి 40మంది వంతున 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంటర్‌మీడియట్‌లో కూడా 40 వంతున సీట్లు భర్తీ చేయనున్నారు. 7,8,9తరగతుల్లో ఖాళీలు ఉంటే వాటికి దరఖాస్తు చేసుకుని ఎవరైనా జాయిన్ అయితే ఖాళీల ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు. కేజీబీవీలోనే 10వ తరగతి పాసైన వారు ఇంటర్‌మీడియట్‌లో అక్కడే చేరాలంటే వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే.

షెడ్యూల్ ఇలా..

దరఖాస్తుల స్వీకరణకు చివరితేదీ ఏప్రిల్, 11. ప్రిపరేషన్ ఆఫ్ సెలక్షన్ జాబితా ఏప్రిల్, 16. వెరిఫికేషన్ ఏప్రిల్ 16 నుంచి 18. 6వ తరగతి, ఇంటర్‌మీడియట్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితా ఏప్రిల్, 21. ఎంపికైన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఏప్రిల్ 21నుంచి 25వరకు ఉంటుంది.

వీరికి తొలిప్రాధాన్యం

అనాథ బాలికలు, సింగిల్ పేరెంట్, పేదపిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలకు తొలి ప్రాధాన్యం కింద కేజీబీవీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వలస కూలీల చిన్నారులు, కార్మిక శాఖ అధికారులు సిఫార్సు చేసిన వారికీ ప్రవేశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. రాష్ట్ర స్థాయిలో స్క్రూట్నీ అనంతరం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థి మొబైల్‌కు ఎంపికైనట్లు సమాచారం అందిస్తారు.

ఫిమేల్ లిటరసీ రేటు ఆధారంగా

ఫిమేల్ లిటరసీ రేటు తక్కువగా ఉన్న మండలాలకు చెందిన విద్యార్థినులకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఆ ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు.

గుణాత్మక విద్యాబోధన

కేజీబీవీలో బాలికలకు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందిస్తున్నారు. ఆంగ్లమాధ్యమం బోధిస్తారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, కంప్యూటర్ విద్య, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.

పేద విద్యార్థినులకు మంచి అవకాశం



పేద విద్యార్థినులకు ఇదొక మంచి అవకాశం. ఉచితంగా విద్య, వసతి అందుబాటులో ఉంటాయి. ఇంటర్‌మీడియట్ పూర్తయ్యేంతవరకువిద్య అంతా ఉచితంగా సాగుతుంది. క్రమశిక్షణతో కూడుకున్న, నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.

– మధురవాణి, ప్రిన్సిపాల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, వంతరాం

క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామి వారికి గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తుల ముడుపుల పూజలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణార్థం దూర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఇక్కడ జరుగుతున్న ముడుపుల పూజల కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలియజేశారు. స్వామివారిపై భక్తుల్లో ఉన్న నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకుని ముడుపులు చేస్తున్నట్లు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆలయ ప్రాంగణంలో వేచి ఉన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ప్రసాద వితరణ చేస్తున్నట్లు శ్రీనివాసాచార్యులు తెలియజేశారు.

క్రమం తప్పకుండా సేవలందించాలి

- డీపీఓ కొండలరావు


కృష్ణపల్లిలో పారిశుధ్య నిర్వహణపై గృహ యజమానిని ఆరా తీస్తున్న డీపీఓ కొండలరావు

పార్వతీపురం రూరల్: గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది క్రమం తప్పకుండా ప్రజలకు సేవలందించాలని డీపీఓ కొండలరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి రోజూ జరుగుతున్న పారిశుధ్య పనులపై అడిగి తెలుసుకున్నారు. చెత్తనిల్వలు, కాలువల్లో మురుగు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పనులు చేపట్టి గ్రామాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

పెన్షన్ రూల్స్‌లో మార్పు సరికాదు


హెడ్‌పోస్టాఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న పోస్టల్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ రివైజ్ చేయకుండా మోదీ తీసుకువస్తున్న బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏఐపీఆర్‌పీఏ సెక్రటరీ చలం తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణ హెడ్‌పోస్టాఫీస్ వద్ద ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ నిబంధనల సవరణ ఉత్తర్వుల బిల్లు అనే పేరుతో ఆర్థిక బిల్లుతో సహా కలిపి దొంగతనంగా ఈ బిల్లు ప్రవేశపెట్టారని, ఆ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల మద్యం సీసాలు స్వాధీనం

పార్వతీపురం రూరల్: మండలంలోని జమదాల గ్రామానికి చెందిన ధర్మ అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు గురువారం తెలిపారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

పార్వతీపురం పట్టణ పరిధిలో కొత్తవలస ఫ్లైఓవర్‌పై 13 మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న విజయరామరాజు కాలనీకి చెందిన రెడ్డి శంకరరావు అనే వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పార్వతీపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మజ్జి శోభారాణి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేణు

బలిజిపేట: మండలంలో పేరుకుపోతున్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య వేధిస్తోందన్నారు. తుమరాడ, బర్లి, వెంగళరాయపురం, గంగాడ తదితర గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల్లో పూడిక తీత తీయకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. మోడల్ స్కూల్ పేరుతో ఎలిమెంటరీ స్కూళ్లను తరలించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం మానుకోవాలని సూచించారు. స్కూళ్లను తగ్గించి విద్యను పేద వాడికి దూరం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించుకుందని ఆరోపించారు. విద్యను కార్పొరేట్‌ల చేతుల్లోకి తరలించేందుకు అక్కర్లేని పనులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజలకు మేలుచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.భానుమూర్తి, మన్మథరావులు పాల్గొన్నారు.

పింఛన్ దారులపై పిడుగు

- మోడీ దొంగ బిల్లులు ఖండించండి: యూటీఎఫ్


యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు

పార్వతీపురంటౌన్: పింఛన్ దారులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పింఛన్ రివైజ్ చేయకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకువస్తున్న బిల్లును తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన తరువాత ప్రతి పీఆర్‌సీలో పింఛన్ రివైజ్ చేస్తారని, అలా చేయడం వల్ల ధరలకు అనుగుణంగా పింఛన్ పెరిగి పింఛన్‌దారులకు ఊరట కలుగుతుందన్నారు. కానీ మార్చి 25న లోక్‌సభలో ఆర్థిక బిల్లు ప్రవేశపెట్టినప్పుడు పెన్షన్ నిబంధనల సరవరణ ఉత్తర్వుల బిల్లు పేరుతో ఆర్థిక బిల్లుతో సహా కలిపి దొంగతనంగా ఈ బిల్లు ప్రవేశపెట్టారన్నారు. వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించినప్పటికీ లోక్‌సభ ఆమోదం పొందిందని, రాజ్యసభలో ఆమోదం పొందడానికి బిల్లు పెడతారని అప్పుడైనా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం దాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ దొంగబిల్లును వెనక్కి తీసుకోకపోతే అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే

- సరిహద్దు లోపాలను సవరించేందుకు అవకాశం
- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ


సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం రూరల్: భూ యజమానుల సమక్షంలోనే రీసర్వేను పారదర్శకంగా చేపట్టనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో రెండో విడతలో జరిగిన రీసర్వే అవగాహన ర్యాలీలో పాల్గొని రైతులతో మాట్లాడారు. రైతులకు ముందుగా నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో కచ్చితమైన భూమి హద్దులను నిర్ణయించనున్నారని, సర్వేలోని లోపాలు, ఇబ్బందులను సవరించుకునేందుకు ఇది మంచి అవకాశమని రైతులతో అన్నారు. రైతులు రీసర్వే గ్రామసభకు హాజరై రికార్డులను స్పష్టంగా సరిచూసుకోవాలని, అవసరమైన సవరణలు చేయాలని రీసర్వే సిబ్బందిని పీఓ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్, మండల సర్వేయర్లు, క్షేత్రస్థాయి రీ సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వద్దు..ప్రభుత్వ పాఠశాలే ముద్దు

- ఎంఈఓ-1సామల


పి.రావివలసలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ-1సామల సింహాచలం

బలిజిపేట: ఫీజులు చెల్లించి చదివించే ప్రైవేట్ పాఠశాలల కంటే ఉచిత విద్య, మధ్యాహ్న భోజన పథకం, మౌలిక సదుపాయాల కల్పనతో ఇంటికి సమీపంలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో చదువే ఎంతో మంచిదని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పి.రావివలసలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే ప్రత్యేక డ్రైవ్‌లో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఉండే తేడాను వారికి వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే జాయిన్ చేయాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు బడిలో చేరిక


లచ్చయ్యపేటలో బడిలో చేర్పిన విద్యార్థితో ఎంఈఓ సూరిదేముడు


బడిబయట ఉన్న విద్యార్థితో ఎంఈఓ వెంకటరమణ

సీతానగరం: మండలంలో వివిధ కారణాలతో బడి బయట ఉన్న బడిఈడు పిల్లలను సమీప పాఠశాలల్లో చేర్పించి అందరికీ ప్రభుత్వ విద్య అందించనున్నామని ఎంఈఓ-1 జి. సూరిదేముడు, ఎంఈఓ-2 ఎం వెంకటరమణ అన్నారు. ఈ మేరకు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు గురువారం వివిధ గ్రామాల్లో సీఆర్పీలతో నిర్వహించిన సర్వేలో గుర్తించిన పిల్లలను బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల మధ్య ఏర్పడిన కలహాలు, వలస వెళ్లిన వారి పిల్లలు బడి బయట ఉన్నట్లు గుర్తించామన్నారు. అటువంటి వారిలో నలుగురిని బడిలో చేర్పించామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో గుర్తించిన వారందరినీ మరో రెండు రోజుల్లో నిర్దేశించిన పాఠశాలల్లో చేర్పించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సహోపాధ్యాయులు, పిల్లల సంరక్షకులు పాల్గొన్నారు.

ఆప్కాస్ విధానాన్నే కొనసాగించాలి.

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

పార్వతీపురం: పారిశుద్ధ్య కార్మికుల హక్కులను హరించేలా ఏజెన్సీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని గతంలో ఉన్న ఆప్కాస్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించేలా ఆప్కాస్ విధానాన్ని ప్రవేశపెట్టగా ప్రస్తుత ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ఏజెన్సీలకు ముట్టజెప్పేందుకు కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. పారిశుద్ధ్య కార్మికులకు 62ఏళ్ల వయోపరిమితి పెంచుతూ రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి దృష్ట్యా పనివేళలు తగ్గించి, కార్మికుల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రభుత్వం ఏజెన్సీలను పెట్టే ఆలోచనను విరమించుకోవాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె. పకీరుకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్.శంకరరావు, సీహెచ్ సింహాచలం, ఎన్.మల్లేష్, ఎం.శివతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రీ కటింగ్, మెయింటనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోపాలదాస్‌పేట ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంలోని ఇందిరాకాలనీ, గంటా వీధి, మాదిగ వీధి, నిర్మలకాలనీ, దేవాంగుల వీధి, బంధంవారి వీధి, బరాటం వీధి, కంకటి వీధి, నెయ్యిలవీధి, పాతబస్టాండ్, దంగిడివీధి, అమ్మికోనేరు, ఎస్ఎన్ఎం నగర్, దుర్గగుడి రోడ్డు, తూర్పువీధి, కాకర్ల వీధి, కొత్తవీధి, రాయగడ రోడ్డు, వెంకటేశ్వర కాలనీ, గాసివీధి, పరమేశ్వరినగర్, జట్టు ఆశ్రమం, సూర్యపీఠం వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పురప్రజలంతా విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పార్వతీపురం మండలంలో..

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల, పిన్నింటి రామినాయుడువలస, బంటువానివలస, బాలగుడబ, వెంకట్రాయుడుపేట, నర్సిపురం బీసీ కాలనీ, విశ్వంరపురం గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. అడ్డాపుశీల 11కేవీ ఫీడర్ మీద ఉన్న ఈ గ్రామాలకు మెయింటనెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ రామారావు తెలిపారు.

ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళికలు

సీతానగరం: రానున్న ఖరీఫ్ సాగుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని రీజనల్ టెక్నికల్ అధికారులు ప్రకాశరావు, కె.హేమసుందర్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని వెలుగు మండలసమాఖ్య కార్యాలయంలో ఏఓ ఎస్.అవినాష్ అధ్యక్షతన వ్యవసాయశాఖ, రైతు సాధికారసంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 2025-26 ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుళ పంట విధానం అమలు చేయాలని సూచించారు. నవధాన్యాల సాగుకు వెలుగు సంఘం నుంచి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా అవసరమైన సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం విధానాన్ని అలవర్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు, డీపీపీ మంతిని మానస, ఎస్ఎఫ్ఏ వై.తిరుపతి, వై.శ్రీరాములు నాయుడు, ఎ.శ్రీదేవి, వ్యవసాయ సహాయకులు, వెలుగు సభ్యులు పాల్గొన్నారు.

మినరల్ కాదు జనరలే..!

- ప్రజారోగ్యంతో చెలగాటం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు


పార్వతీపురంలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్

పార్వతీపురం టౌన్:

మినరల్ వాటర్ పేరుతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు జనరల్ వాటర్ సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఏ మాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వేసవి తరుణంలో నాణ్యత లేని నీటితో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. నీటి దోపిడీని అరికట్టాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో స్థానికులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పార్వతీపురం పట్టణం, మండలంలో 27 వరకు వాటర్ ప్లాంట్‌లున్నాయి. దూర ప్రాంతాలకు ఆటోల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు

వాటర్ ప్లాంట్లలో చాలా వరకు ఐఎస్ఐ గుర్తింపు లేదు. ప్రతి ప్లాంటులో నీటిని నిల్వ చేసే ట్యాంక్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఉండాలన్న ప్రధాన నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో ప్రజలు ఆయా ప్లాంట్లలో అరకొరగా శుద్ధి చేసిన నీళ్లను కొనుగోలు చేసి అనారోగ్యాలకు గురవుతున్నారు. ఆటోల్లో మినరల్ వాటర్ పేరుతో ఒక్కో క్యాన్ రూ.20, నేరుగా వెళ్లిన వారికి రూ.15లకు విక్రయిస్తున్నారు.

తనిఖీలకు ఆదేశాలిచ్చాం

మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను సచివాలయ సిబ్బంది తరచూ తనిఖీ చేసేలా ఆదేశాలు ఇచ్చాం. అందుబాటులో ఉన్న కార్యదర్శులు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేస్తున్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలి. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం.

– పకీర్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం

నాణ్యతా ప్రమాణాలు ఇలా..

- అధికారుల అనుమతి తీసుకున్నాకే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.
- వాటర్ క్యాన్ మీద నీటిని శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబర్‌ను నమోదు చేయాలి. ప్రతి నెలా శానిటరీ అధికారులు పరీక్షించి ఆ నీటిని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌కు పంపాలి.
- వాటర్ ప్లాంట్ ప్రారంభించాలంటే ఐఎస్ఐ నిబంధనలు తప్పక పాటించాలి.
- ప్లాంటులో మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులు ఏర్పాటు చేయాలి.
- శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసేందుకు 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులు మాత్రమే ఉపయోగించాలి.
- నీటిలో పీహెచ్ శాతం ఎంత ఉందో పరీక్షించాలి. పీహెచ్ శాతం 75 శాతం తగ్గితే ఆ నీటిని తాగిన వారు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు.

రుణాల కోసం ఆరాటం

- ఎంపీడీఓ ఆఫీస్‌లో ఆశావహులు
- 108 యూనిట్లకు 594 మంది హాజరు


రుణం పొందడానికి వచ్చిన వారి రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు, బ్యాంక్ అధికారులు

సీతానగరం: మండలంలో స్వయం ఉపాధి పథకం యూనిట్లకోసం వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొందడానికి గురువారం ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు నిర్వహించిన ఎంపికకు 594 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఎంపికకు ఉదయం 10 గంటలకే అభ్యర్థులు హాజరుకావడంతో సాయంత్రంవరకూ ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు మాట్లాడుతూ 8 బ్యాంకులకు సంబంధించిన అధికారులకు రుణాల కోసం 620 మంది ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోగా 594 మంది హాజరయ్యారని తెలియజేశారు. మండలంలోని యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ, విశాఖగ్రామీణబ్యాంక్, ఐసీఐసీ కో ఆపరేటివ్, సెంట్రల్ బ్యాంక్‌కు సంబంధించిన అధికారులు ఎంపికలో పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మక్కువ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు గురువారం జరిగిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. 326 మంది లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 276 మంది ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఎంపీడీవో డీడీ స్వరూపారాణి లబ్ధిదారుల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను నిశితంగా తనిఖీ చేసి సంబంధిత బ్యాంకు శాఖలకు అందజేశారు. ఇంటర్వ్యూ తీరును జెడ్పీటీసీ మావుడి. శ్రీనివాసరావు పరిశీలించారు. దరఖాస్తుదారుల రుణ అర్హతను కొద్ది రోజుల్లో పరిశీలించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.దేవకుమార్, ఎస్బీఐ, ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంక్ శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.


లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో